

అష్టలక్ష్మి ఆలయాన్ని దర్శించుకుంటున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే హరీశ్‌బాబు తదితరులు

అష్టలక్ష్మి ఆలయంలో ఈటల ప్రత్యేక పూజలు

ఎల్బీనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆలయాలలో సుప్రసిద్ధమైన కొత్తపేటలోని అష్టలక్ష్మి ఆలయాన్ని ఎంపీ ఈటల రాజేందర్ దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రకాష్‌రెడ్డితో కలిసి ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రతీ వ్యక్తి ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, నర్సింహగుప్తా, పవన్‌కుమార్, ఆలయ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, చైర్మన్ సోమ సురేష్, కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్యగుప్తా పాల్గొన్నారు.



గోడౌన్‌ను పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

రైతులకు కొత్తగా పంట రుణాలు ఇవ్వాలి

- డీసీసీబీ చైర్మన్ సత్తయ్య

హయత్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య బుధవారం యాచారం మండల పీఏసీఎస్‌ను సందర్శించారు. ఈసందర్భంగా నూతనంగా నిర్మించిన సంఘం గోడౌన్ భవనాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసి సంఘం పనితీరును, సంఘంలో నెలకొన్న సమస్యలను చైర్మన్ రాజేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నూతన రైతులకు కొత్తగా పంట రుణాలు అందివ్వాలని చైర్మన్‌ను కోరారు. కార్యక్రమంలో తుర్కయంజాల్ సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, యాచారం సంఘం సీఈవో సుధాకర్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్, డీఈ

సమస్యల పరిష్కారానికి కృషి

చంపాపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ఆయా కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సత్వరమే పరిష్కరించడమే తన లక్ష్యం అని కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని జడ్పీరోడ్‌లోని నయారా పెట్రోల్‌బంక్ ఎదుట రహదారిపై వర్షపు నీరు నిలుస్తుండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆ సమస్య పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయించింది. బుధవారం అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులను కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ డీఈ కార్తీక్, ఏఈ మల్లికార్జున్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో టీచర్స్ కాలనీ అధ్యక్షుడు సాయిరెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

అభివృద్ధి పనుల పరిశీలన

హయత్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ ఏరియాలోని పవనగిరికాలనీ, ఎల్లారెడ్డికాలనీ, లక్ష్మీనగర్, శివారెడ్డినగర్, ఆగమయ్యనగర్ కాలనీలలో రూ.94లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ ట్రంకు లైను పనులను మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి బుధవారం స్థానిక కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జోనల్ కమిషనర్ స్వయంగా వచ్చి సమస్యలను చూసి నిధులు మంజూరు చేయడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో వివిధ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

- ఈఆర్‌ఐడీఈ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ అధికారి దేవేందర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉన్నదని ఈఆర్‌ఐడీఈ సంస్థ వ్యవస్థాపకుడు చీఫ్ ఎగ్జిక్యూటీవ్ అధికారి అల్వాల దేవేందర్ రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి కళాశాలలో



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు

ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థుల ఓరియంటేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దేవేందర్‌రెడ్డి జేఎన్‌టీయూ ప్రొఫెసర్ సంతోషికుమార్, కళాశాల చైర్మన్ అవంతి శ్రీనివాస్‌రావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. అదేవిధంగా కంపెనీలను స్థాపించి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్. జయప్రద, ప్రిన్సిపాల్స్ రాంచంద్రారెడ్డి, అజ్మల్ హుస్సేన్, క్యాంపస్ ఇన్‌చార్జి బోసు, పీఆర్‌ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దారిదోపిడీకి పాల్పడ్డ ముగ్గురి అరెస్ట్

- నిందితులలో బాలుడు

సైదాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాత్రివేళలలో రోడ్డుపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అటకాయించి దారిదోపిడీకి పాల్పడ్డ ముగ్గురు నిందితులను సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులలో ఓ బాలుడు ఉండటంతో జువెనైల్ హోంకు పంపించారు. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, డీఐ ఆనంద్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఈనెల 17న రాత్రి ఎస్‌బీహెచ్‌కాలనీకి చెందిన రామ్మోహన్‌యాదవ్(54), 18న రాత్రి యాఖత్‌పురాకు చెందిన సయ్యద్ అక్బర్(34) సింగరేణికాలనీకి పనిపై నడుచుకుంటూ వస్తుండగా ముగ్గురు వ్యక్తుల ముఠా అటకాయించింది. బెదిరించి వారి వద్ద ఉన్న కొంత నగదు, సెల్‌ఫోన్లు దోచుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దోపిడీకి పాల్పడింది సింగరేణికాలనీకి చెందిన జీహెచ్‌ఎంసీ దినసరి కూలీ పి. ప్రసాద్(21), మహేష్(21)తో పాటు ప్రధాన నిందితుడు బాలుడిగా గుర్తించి అరెస్ట్ చేసి వారి వద్ద రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

స్వచ్ఛ కార్పొరేషన్ దిశగా అడుగులు

- పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం
- ప్రజలు కూడా సంపూర్ణంగా సహకరించాలి
- ప్లాస్టిక్ వస్తువుల తయారీని నిషేధించాలి
- బడంగ్‌పేట్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి

సరూర్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, స్వచ్ఛ కార్పొరేషన్‌గా మార్చడానికి శాయశక్తులా కృషి చేస్తున్నామని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి తెలిపారు. దీనికి ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని ఆయన అన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పారిశుధ్యంపై పలు వివరాలు వెల్లడించారు. ఇంటర్వ్యూ విశేషాలు ఇవీ..

బడంగ్‌పేట్‌లో పారిశుధ్య నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

యాదగిరి: కార్పొరేషన్‌లో ఆరు ట్రాక్టర్లు, ఎనిమిది ఆటో రిక్షాలు, ఒక జేసీబీ, ఒక గల్పర్ మెషీన్ అందుబాటులో ఉన్నాయి. వాటి సాయంతో ప్రధాన రహదారులు, కూడళ్లు, ఇతరత్రా పబ్లిక్ ప్లేస్‌లలోని చెత్త కుప్పలను తొలగిస్తున్నాం. గల్పర్ మెషీన్‌తో భూగర్భ డ్రైనేజీలు,



ఇంటర్వ్యూ...

మ్యాన్‌హోళ్లు క్లీన్ చేయిస్తున్నాం. ఇవిగాక 57 ప్రైవేటు ఆటోలు ఏర్పాటు చేసి కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఇటీవల పదిహేను రోజుల పాటు 'స్వచ్ఛత సేవ' పేరుతో పలు కార్యక్రమాలు చేపట్టారు కదా. ఆ కార్యక్రమం ఆ 15 రోజులకే పరిమితమా.. లేక నేటికీ కొనసాగిస్తున్నారా?

యాదగిరి: పారిశుధ్య నిర్వహణలో 'స్వచ్ఛత సేవ' అనేది పరిమిత కాలానికి తీసుకున్న ఒక ప్రత్యేక కార్యక్రమం. ఇది నిరంతర ప్రక్రియ.. దానిని నేటికీ క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నాం.

పారిశుధ్య నిర్వహణ కోసం ఎంత మంది సిబ్బంది ఉన్నారు. వారిని డివిజన్లకు ఎలా విభజించి పనులు చేయిస్తున్నారు?

యాదగిరి: బడంగ్‌పేట్‌లో మొత్తం 285మంది పారిశుధ్య సిబ్బంది ఉన్నారు. డివిజన్ల విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో డివిజన్‌కు ఆరు నుంచి ఎనిమిది మంది వరకు కేటాయించి వారితో పనులు చేయిస్తున్నాం.

అక్కడక్కడా 'చెత్త వేయరాదు' అనే బోర్డులు పెడుతున్నారు. అయినా అక్కడే చెత్త పడేస్తున్నారు. దీనిపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

యాదగిరి: ఇది నిజమే.. బోర్డులు ఉన్నా కొందరు వ్యక్తులు అక్కడే చెత్త వేస్తున్నారు. దీనిని అరికట్టడానికి చెత్త వేసే వారిని పట్టుకుని చలానాలు విధిస్తున్నాం. తరచుగా చెత్త వేసే ప్రదేశాలను గుర్తించి అక్కడ మా సిబ్బందితో క్లీన్ చేయించి ముగ్గులు వేసి 'ఇక్కడ చెత్త వేయరాదు' అనే క్యాప్షన్లు రాయిస్తున్నాం. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

నిబంధనల ప్రకారం ఎక్కడా కూడా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, గ్లాసులు, ప్లేట్లు వగైరా వాడరాదు కదా. అయినా కార్పొరేషన్‌లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగిస్తున్నారు. దీనిపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

యాదగిరి: తరచుగా వ్యాపార సంస్థలను తనిఖీ చేసి ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నాం. వారికి ఫైన్ కూడా విధిస్తున్నాం. అయినా అనేక మంది దొడ్డిదారిలో ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. అసలు ప్లాస్టిక్ వస్తువులు(క్యారీ బ్యాగులు మొదలైనవి) తయారు చేయడాన్ని నిషేధిస్తేనే దాని వాడకాన్ని పూర్తి స్థాయిలో అరికట్టగలుగుతాం.

చివరగా ప్రజలకు ఏం చెబుతారు?

యాదగిరి: పారిశుధ్య నిర్వహణకు మేం ఎంత చేసినా తక్కువే. వంద శాతం పారిశుధ్య నిర్వహణ చేస్తున్నామని మేం చెప్పుకోం. ఎందుకంటే మేం ఓ చోట శుభ్రం చేస్తే మరో చోట చెత్త కనిపిస్తుంటుంది. ఒక్కోసారి మేం చెత్త తొలగించిన పది నిమిషాల్లోనే అక్కడ కొందరు మళ్లీ చెత్తను పడేస్తుంటారు. దాంతో మేం సరిగా పని చేయడం లేదనే అపోహ ప్రజల్లో నెలకొంటుంది. ముఖ్యంగా ప్రజలు పరిశుభ్రతపై అవగాహన పెంచుకుంటేనే మేం చేసే పనికి సార్థకత ఉంటుంది. దీనిని ప్రజలు గమనించి మాకు సహకరించాలని కోరుకుంటున్నాను.

సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ హైకోర్టుకాలనీకి చెందిన వెంకటేశ్వర్లు రేణుక దంపతులకు దీక్షిత్(8) పుట్టకతోనే చెవులు వినపడకుండా జన్మించాడు. క్రమేపి అతనికి నోటి మాటలు కూడా ఆగిపోవడంతో బాబు తల్లిదండ్రులు వైద్యులను సంప్రదించారు. అధిక మొత్తంలో బాబు వైద్య ఖర్చులు అవుతాయని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి బాబు ఆరోగ్య సమస్యలను వివరించాడు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే బాబు ఆపరేషన్‌కు కావాల్సిన డబ్బుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. దీంతో మంజూరైన రూ.4లక్షల 50వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన వారు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవానిప్రవీణ్‌కుమార్, నాయకులు సదానంద్‌రెడ్డి, శంకర్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వంలో ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు

- చైర్మన్ ముత్తినేని వీరయ్య

ఓల్డ్‌మలక్‌పేట, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా వారికి సమాజంలో తగిన గుర్తింపు వచ్చిందని వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. బుధవారం మలక్‌పేటలోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్ల ఆధార్ కార్డు జారీ ప్రక్రియ ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి సారి ట్రాన్స్‌జెండర్ల కాలంతో ఆధార్ కార్డు జారీచేయడం జరుగుతుందన్నారు. ఉపాధి, సంక్షే మం పరంగా ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు ఆధార్‌కార్డులు జారీచేస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వికలాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడున్నా సరే మూడురోజుల పాటు మలక్‌పేట వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే క్యాంపులో కొత్తకార్డుల జారీ, మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ట్రాన్స్‌జెండర్లు సమాజంలో గౌరవంగా జీవించేందుకు వారికి ప్రభుత్వం అన్ని విధాల సహాయసహకారాలు అందిస్తుందన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక వైద్య క్లినిక్‌లు అందుబాటులోకి తేనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్‌శాఖ అధికారి నర్సింగ్‌రావు,ప్రోగ్రాం మేనేజర్ జయంతి, కోఆర్డినేటర్ ప్రీతి, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్లకు ఆధార్ కార్డు అందిస్తున్న చైర్మన్ వీరయ్య, డైరెక్టర్ శైలజ

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి: జంగం శ్వేత

సైదాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): యాఖత్‌పురా నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి కోరారు. బుధవారం ప్రశాంత్‌నగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదును ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవీందర్‌రెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, నేతలు రేణుకా ముదిరాజ్, సుష్మ పాల్గొన్నారు.

సైదాబాద్ డివిజన్‌లో..

సైదాబాద్ డివిజన్ ఎస్‌బీహెచ్‌కాలనీలో బుధవారం కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. డివిజన్‌లో రికార్డు స్థాయిలో పార్టీ సభ్యత్వాల నమోదుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గంగిశెట్టి రాజేష్, సురేష్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో కార్పొరేటర్ శ్వేతారెడ్డి

ఇసుక రీచుల్లో అక్రమ వసూళ్లను అరికట్టండి

- తెలంగాణ ఇసుక లారీ యజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాదయ్యగౌడ్

వనస్థలిపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): టీఎస్‌ఎండీసీ అధికారికంగా ఇసుక లోడింగ్ చేస్తున్న ఇసుక రీచుల్లో కాంట్రాక్టర్లు చేస్తున్న అక్రమ వసూళ్లను అరికట్టి ఇసుక లారీ యజమానుల శ్రేయస్సుకు కృషిచేయాలని తెలంగాణ ఇసుక లారీల యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి సప్పిడి శ్రీనివాస్‌రెడ్డిలు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తెలంగాణ ఇసుక లారీల యజమానుల సంఘం ఆధ్వర్యంలో టీఎస్‌ఎండీసీ నూతన ఎండీ సుశీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. యాదయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో కష్ట, నష్టాలకు ఓర్చుకుని తమ లాంటి లారీ యజమానులను అధికారిక ఇసుక రీచుల్లో కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతూ తమ జీవనోపాధికి గండి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక రీచుల్లో అక్రమ వసూళ్లను నివారించి సంబంధిత కార్పొరేషన్ అధికారులు ఇసుక రీచులను తమ ఆధీనంలోకి తీసుకుని ఇసుక లోడింగ్ విధానాన్ని తీసుకరావాలని వారు నూతన టీఎస్‌ఎండీసీ ఎండీ సుశీల్‌కుమార్‌ను కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇసుక లారీల యజమానులు పాల్గొన్నారు.



టీఎస్‌ఎండీసీ ఎండీ సుశీల్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఇసుక లారీ యజమానుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

సరికొత్త డిజైన్.. 'పరగమంజరి'

- ఓయూ బోటనీ విభాగం ప్రాజెక్టు వర్క్‌లో ఆవిష్కరణ
- పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): పువ్వుల పుప్పొడి స్వరూపంలోని సంక్లిష్టమైన అందాన్ని వస్త్ర రూపకల్పనలో పొందుపరిచి 'పరగమంజరి' అనే సరికొత్త డిజైన్‌ను రూపొందించినట్లు ఉస్మానియా యూనివర్సిటీ ప్రకటించింది. ప్రసిద్ధిగాంచిన కలంకారి, పోచంపల్లి, ధర్మవరం ఉప్పాడ సంప్రదాయాలకు సమానంగా సరికొత్తగా పరగమంజరి అనే వినూత్న డిజైన్‌ను ఉస్మానియా యూనివర్సిటీలోని బోటనీ విభాగం ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా తీసుకొచ్చింది. ఈ సరికొత్త డిజైన్ కొత్త తరానికి అద్భుతమైన దుస్తులను ఉత్పత్తి చేయడానికి దోహదపడుతుందని ఓయూ బోటనీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అల్లం విజయ భాస్కర్ రెడ్డి, ఎంఎస్సీ విద్యార్థిని శివానీ నేత తెలిపారు. ఈ సరికొత్త అంశానికి పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశామన్నారు. పరగమంజరి వస్త్ర, డిజైన్ పరిశ్రమలు రెండింటిపై గణనీయమైన ప్రభావం చూపుతుందని భావిస్తున్నామని తెలిపారు. పుప్పొడి అలంకార నమూనాల నుంచి తీసుకున్న ప్రత్యేకమైన ప్రేరణనని, సహజమైన సూక్ష్మ మూలకాలను వస్త్ర రూపకల్పనలో చేర్చడం ఇదే మొదటిసారని తెలిపారు. ఈ శాస్త్రీయ అంశాలను టెక్స్‌టైల్ డిజైన్‌లో ఏకీకృతం చేయడం ద్వారా పరగమంజరి భవిష్యత్ టెక్స్‌టైల్ టెక్నాలజీ పాఠ్యాంశాల్లో చేర్చడానికి మార్గం సుగమం చేస్తుందన్నారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలోని 17 ఇళ్లకు, బస్సు డిపోకు నోటీసులు

హయత్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్ కుమ్మరికుంటను ఆనుకుని ఉన్న పద్మావతికాలనీకి చెందిన 17మంది ఇంటి యజమానులకు, ఆర్టీసీ హయత్‌నగర్ బస్సు డిపోకు హయత్‌నగర్ తహసీల్దార్ మంగళవారం నోటీసులు అందజేశారు. శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌లో నిర్మాణాలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ రెవెన్యూ అధికారుల జాయింట్ ఇన్‌స్పెక్షన్‌ను కోరారు. దీంతో అధికారులు జనవరి 12న కుమ్మరికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, శిఖం భూమిని సర్వేచేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోకి వచ్చే నిర్మాణాలను గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా మంగళవారం రెవెన్యూ అధికారులు 17మంది కుటుంబాలకు, ఆర్టీసీ డిపో మేనేజర్‌కు నోటీసులు అందజేశారు.

కామినేని ఆస్పత్రిలో అరుదైన చికిత్స

మన్సూరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ కామినేని ఆస్పతిలో అరుదైన శస్త్ర చికిత్స చేసి రోగి ప్రాణం కాపాడారు వైద్యులు. బుధవారం ఏర్పాటు చేసిన సమాశంలో ఆస్పత్రి క్రిటికల్ కేర్ మెడిసిన్ కన్సల్టెంట్ వైద్యులు కె. వెంకటరమన, శృంగ దేవిజన్ వివరాలు వెల్లడించారు. నాచారం ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారికి ఇటీవల డెంగీ సోకింది. ఆక్సిజన్ లెవల్స్ పడిపోవడంతో కామినేని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అతడిని పరీక్షించి ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఎక్మో సాయంతో ఆరు రోజులపాటు చికిత్స అందించారు. మూడు రోజులు పరీక్షించారు. పూర్తిగా కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జి చేశామని తెలిపారు. రోగి, అతడి కుటుంబ సభ్యులు కామినేని ఆస్పత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



డిశ్చార్జ్ అనంతరం కామినేని ఆస్పత్రి వైద్య బృందంతో రోగి

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

- కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కాలనీల సమస్యల పరిష్కారానికి దశలవారీగా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. బృందావన్‌కాలనీ, న్యూమారుతీనగర్ కాలనీల్లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను, బృందావన్‌కాలనీ నుంచి మూసీ వరకు రూ కోటీ ముప్పైలక్షలతో నిర్మించిన బాక్స్‌డ్రెయిన్‌ను బుధవారం ఆయన జీహెచ్‌ఎంసీ ఏఈ మాతృనాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

పిల్లి గుడిసెల్లోని 'డబుల్' ఇళ్లను పరిశీలించిన సెర్ప్ సీఈఓ

- ఇళ్లలోని సదుపాయలపై ఆరా

చాదర్‌ఘాట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ పిల్లి గుడిసెల్లోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల (2 బీహెచ్‌కే)లో కల్పిస్తున్న సదుపాయాలపై బుధవారం సెర్ప్ ఆరా తీసింది. ఇటీవల మూసీ గర్భంలోని 133 కుటుంబాలను ఇక్కడి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు తరలించారు. అయితే, ఇక్కడ సరైన సదుపాయలు లేవని పలు కుటుంబాల వారు ఫిర్యాదు చేయడంతో సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, హైదరాబాద్ ఆర్డీఓ మహిపాల్, జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ యూసీడీ చంద్రకాంత్‌రెడ్డి, చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న, హౌసింగ్ సీఈ అనిల్ రాజ్, మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్‌తో కూడిన అధికారుల బృందం పిల్లి గుడిసెల్లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించారు. ఇక్కడ నివాసం ఉంటున్న వారితో అధికారుల మాట్లాడగా, పలు సమస్యలున్నాయని చెప్పారు. అనంతరం సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ మాట్లాడుతూ, ఇక్కడ చాలా చిన్న చిన్న సమస్యలు ఉన్నాయన్నారు. లిఫ్ట్ సరిగ్గా పని చేయడం లేదని, నీటి సరఫరా జరగడం లేదని చెప్పారని, ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. మూసీ నిర్వాసిత పిల్లలు చదువు కొనేందుకు ఇక్కడ ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా ఆమె పరిశీలించారు. ఇంతలో అక్కడికి చేరుకున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోని సమస్యలను వివరించారు. కాగా, ఇక్కడ ఉంటున్న వారి పిల్లలు మెయిన్ రోడ్డులోని పాఠశాలకు వెళ్లి చదువు కొనేందుకు రెండు వ్యాన్లు అందుబాటులో ఉంచుతామని చిన్నారుల తల్లులకు హామీ ఇచ్చారు.




పిల్లి గుడిసెల్లోని 2బీహెచ్‌కేలో ఉన్న సమస్యలను తెలుసుకుంటున్న సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, పక్కన ఎమ్మెల్యే బలాల, జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి, చార్మినార్ జెడ్సీ వెంకన్న తదితరులు

నా భర్త ఆచూకీ కనిపెట్టండి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య

హయత్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పనిమీద బయటకు వెళ్లిన తన భర్త నెల రోజులైనా ఇంటికి రాలేదని, తన భర్త ఆచూకీ కనిపెట్టాలని ఓ మహిళ హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. దూంగ్రావత్ ప్రియాంక, తన ముగ్గురు పిల్లలు, భర్తతో కలిసి తొర్రూర్‌లో నివాసం ఉంటుంది. భర్త సంతోష్(36) ఇసుక లోడింగ్ అన్‌లోడింగ్ చేస్తుంటాడు. కాగా నెల రోజుల క్రితం పని ఉందని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఇంత వరకు తిరిగి రాలేదు. అక్టోబర్ 7న 7036860976 ఫోన్ నంబర్ నుంచి ఫోన్ చేసి తాను సాగర్ రింగు రోడ్డు వద్ద ఉన్నానని, పని మీద బయటకు వెళ్తున్నానని చెప్పాడని ప్రియాంక హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత ఫోన్ స్విచ్చాఫ్ అయిందని ఆమె తెలిపారు. బంధువులను విచారించినా తన భర్త ఆచూకీ తెలియడం లేదని ఆమె తెలిపారు. ప్రియాంక ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంతోష్(ఫైల్)

అద్దాలు ధ్వంసం చేసి

కారులో ఉన్న రూ. 2లక్షలు చోరీ

హయత్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కారు వెనుక అద్దాలు ధ్వంసం చేసి కారులో ఉన్న రూ. 2లక్షల నగదును అపహరించుకుపోయిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చింతల్‌కుంట సరస్వతినగర్‌కు చెందిన వాకిటి సుధాకర్‌రెడ్డి బుధవారం ఉదయం డాక్యుమెంట్ తయారు చేయించడానికి తన స్నేహితుడితో కలిసి కారులో హయత్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గల డాక్యుమెంట్ రైటర్ కార్యాలయానికి వచ్చారు. తన వద్ద గల సంచిలో రూ.2లక్షలు ఉండడంతో కారులోనే పెట్టి వెళ్లారు. కొంత సేపటికి వచ్చి చూడగా కారులో ఉన్న నగదు కనిపించలేదు. కారు వెనుక అద్దం ధ్వంసం చేసి ఉంది. గుర్తు తెలియని దుండగులు కారు అద్దాలు ధ్వంసం చేసి నగదు అపహరించుకుపోయారని పేర్కొంటు బుధవారం సాయంత్రం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.